క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న అధికారులు

కళ్యాణదుర్గం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నాగే నాయక్ అన్నారు. పట్టణంలోని నగర వనంలో సోమవారం ఎన్విరాల్మెంట్ ప్రోగ్రాం కింద మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవరణ పరిధిలో పలు మొక్కలను నాటారు. ప్రతి ఒక్కరూ విధిగా ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ స్ట్రైక్ ఫోర్స్ హెల్పర్స్, స్థానికులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ జేఈగా శ్రీనివాసులు



కూడేరు: మండల ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫాతిమా మెడికల్ లీవ్‌పై వెళ్లారు. దీంతో మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా కణేకల్లు మండల జేఈ శ్రీనివాసులుకు ఉన్నతాధికారులు ఇన్‌చార్జ్ జేఈ బాధ్యతలను అప్పగించారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, సిబ్బందిని సమన్వయం చేసుకుని మండలంలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపడతానన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల దీక్ష

కంబదూరు: మాదిగల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఒక రోజు నిరాహార దీక్ష నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ సాకే గురుమూర్తి, మండల అధ్యక్షుడు గంపల రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు గుద్దెళ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణకు కృషి



మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ లక్ష్మానాయక్

కణేకల్లు: బాల్య వివాహాల నియంత్రణకు అన్నిశాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాలని కణేకల్లు మండల స్పెషల్ ఆఫీసర్ లక్ష్మానాయక్ సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం బాల్య వివాహాల నియంత్రణపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్య ఆవశ్యకతను తల్లిదండ్రులకు వివరించి పిల్లలను ఉన్నత చదువు చదివించేలా ప్రోత్సహించాలన్నారు. సీడీపీఓ యల్లమ్మ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే రెండేళ్ల జైలు శిక్షతోపాటు, లక్ష రూపాయలు జరిమానా విధిస్తామన్నారు. ఎక్కడైనా మైనర్ పెళ్లిళ్లు జరిగితే 1098 లేదా 100 కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజాక్‌వలీ, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్‌డీ గూడెన్న, డాక్టర్ నిరీష, హెడ్‌కానిస్టేబుల్ రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్బరీతో అధిక లాభాలు



మాట్లాడుతున్న ఉషావర్ధిని

గుమ్మఘట్ట: తక్కువ ఖర్చుతో మల్బరీసాగుతో అధికలాభాలు సాధించవచ్చని సెరికల్చర్ కళ్యాణదుర్గం సహాయసంచాలకురాలు ఉషావర్ధిని సూచించారు. మండలంలోని కలుగోడు గ్రామ సచివాలయంలో మల్బరీ సాగుపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. మల్బరీ సాగు వల్ల కూలీల ఖర్చు తగ్గడంతో పాటు, విత్తనాలు, క్రిమిసంహార మందులు, రసాయనిక ఎరువులు వాడాల్సిన అవసరం లేదన్నారు. మూడు ఎకరాలలో పంటను సాగు చేసుకుంటే అందులో రెండు భాగాలు చేసుకుని ఏడాదికి 10 పంటలను సునాయసంగా తీయవచ్చన్నారు. ప్రతి పంటకు ఖర్చులు పోనూ రూ.లక్ష రూపాయలు ఆదాయం లభిస్తుందన్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి కొమ్మ మేత పద్ధతి ద్వారా పట్టు పురుగులను మేపడం సులభతరమన్నారు. ప్రభుత్వం కూడా రైతులకు అనేక రాయితీలు ఇస్తోందన్నారు. వ్యవసాయ శాఖ జిల్లా కమిటీ సభ్యుడు, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మల్బరీ పంటను సాగు చేసుకుని అధిక లాభాలు గడించాలన్నారు. కార్యక్రమంలో రైతులు నాగేంద్రప్ప, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తిప్పేస్వామి, హనుమంతరెడ్డి, మల్లికార్జున, గోవిందరెడ్డి, బొమ్మేష్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

• ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



ఉంతకల్లులో సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

బొమ్మనహాళ్: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని, తెలుగుదేశం పార్టీలా ప్రజలను విస్మరించలేదని ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఉదయం మండలంలోని ఉంతకల్లు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. స్థానికుల సమస్యలకు సచివాలయ సిబ్బంది, సంబంధిత అధికారుల ద్వారా అక్కడికక్కడే పరిష్కర మార్గం చూపారు. విప్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలిచి మళ్లీ అధికారంలోకి తీసుకురావాలన్నారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాలను ఎవరూ నమ్మరాదని విజ్ఞప్తి చేశారు. గతంలో ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన టీడీపీ ఇప్పుడు చిలుక పలుకులు వల్లిస్తోందని అపహాస్యం చేశారు. నిత్యం ప్రజలతో మమేకమైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపించాలని కోరారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందేలా సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, రైతు భరోసా, జగనన్న విద్యా దీవెన, సున్నా వడ్డీ, వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి ఈ నాలుగేళ్లలో రూ.లక్ష నుంచి రూ.3 లక్షలకుపైగా లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ షకీలాబేగం, జెడ్పీటీసీ సభ్యురాలు నీలవేణీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, సర్పంచ్ ముక్కన్న, ఎంపీటీసీ రమేష్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజనేయ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పెద్దిరెడ్డి, సూర్యప్రతాప్‌రెడ్డి, డాక్టర్ బసప్ప, లోకేష్, దానరెడ్డి, కాశీం, యోగేశ్వరరెడ్డి, వన్నల్లి రామాంజినేయులు, పరమేశ్వర తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి నిర్ణయాలు ఆదర్శం



వలంటీర్లను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, అధికారులు

• మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

విడపనకల్లు: ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అభివర్ణించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యలయ ఆవరణలో ఎంపీపీ కరణం పుష్పావతి అధ్యక్షత ఏర్పాటు చేసిన వలంటీర్లకు వందనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడానికి ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందనాన్నారు. వైఎస్సార్‌సీపీ 2024లో మళ్లీ అధికారంలోకి రావాలంటే వలంటీర్లు మరింతగా మెరుగ్గా పని చేసి ప్రజల్లో జగన్ ప్రభుత్వంపై విశ్వాసం పెంచాలన్నారు. ప్రతి పక్షాలు జగన్ పరిపాలనలో అభివృద్ధి జరగలేదని గగ్గోలు పెడుతున్నాయన్నారు. ప్రజలు జీవనంలో మార్పులు వచ్చి వారు చైతన్యవంతులు అయితే అభివృద్ధి కాదా అని ప్రతి పక్షాలను విశ్వేశ్వరరెడ్డి ప్రశ్నించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు చంద్రబాబు నెరవేర్చకుండా అన్ని వర్గాలనూ మోసం చేశారన్నారు. అనంతరం వలంటీర్లతో కలసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండలంలోని 254 మంది వలంటీర్లు సేవలు చేస్తుండగా ఐదుగురికి సేవా రత్న, 249 మందికి సేవా మిత్ర అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దారు బ్రహ్మయ్య, వైఎస్ ఎంపీపీ మోదుపల్లి సునీతారాణి, సచివాలయ కన్వీనర్ భరత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, కరణం భీంరెడ్డి, ఎస్సీసెల్ జిల్లా నాయకులు బి.సుంకన్న, సర్పంచులు మోదుపల్లి రామాంజనేయులు, రామాంజనరెడ్డి, సొసైటీ చైర్మన్ బోయ శ్రీరాములు, కేశన్న, భీంరావు, రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి సోమయ్య, సురేష్, బాషా, దాదావలి, మునాఫ్, కుళ్లాయి స్వామి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు 'వలంటీర్లకు వందనం'

రాయదుర్గం: పట్టణంలోని బాలిలక ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరవుతారన్నారు. పట్టణంలోని 18 వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లంతా హాజరు కావాలన్నారు.

హాజరు కానున్న ప్రభుత్వ విప్

బొమ్మనహాళ్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మండలంలోని గ్రామ వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలను అందజేస్తున్నట్లు ఎంపీడీఓ షకీలాబేగం సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

మాజీ ఎమ్మెల్యే విశ్వ ఆధ్వర్యంలో..

కూడేరు: స్థానిక షిర్డీ సాయిబాబా దేవాలయం వద్ద మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో భాగంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా సోమవారం తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు , వలంటీర్లు హాజరు కావాలని ఆయన కోరారు,

విజయవంతం చేయండి

బెళుగుప్ప: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ పెద్దన్న సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి హాజరవుతారన్నారు. ఉత్తమ సేవలతో ఎంపికైన వలంటీర్లకు సేవా వజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులను ప్రదానం చేసి నగదు పురస్కారాలను అందజేస్తారన్నారు కార్యక్రమానికి వలంటీర్లతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

వజ్రకరూరు: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్లో ఇంటర్ ప్రవేశానికి అర్హులైన వారు జూన్ 7లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్యామలాదేవి సోమవారం ఓ ప్రకటనలో కోరారు. పదోతరగతిలో సాధించిన మార్కులు, రిజర్వేషన్ ప్రకారం ప్రవేశాలు ఉంటాయన్నారు. అలాగే 6వ తగరతితో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఈ నెల 25 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు

రాయదుర్గంటౌన్: మున్సిపాలిటీలో మంగళవారం నుంచి 25వ తేదీ గురువారం వరకూ మూడు రోజుల పాటు ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. పట్టణంలోని 4వ సచివాలయం(పాత కరెంటు ఆఫీస్ చౌడేశ్వరీ కాలనీ), 11వ సచివాలయం(పాతబస్టాండ్ మేధరువీధి) ప్రత్యేక నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. కొత్త ఆధార్ నమోదుతోపాటు బయోమెట్రిక్ అప్డేట్, మొబైల్ నంబర్ లింకు మార్పులు, చేర్పులకు అవకాశం ఉందన్నారు.

పేదల పొట్ట కొట్టేందుకు కేంద్రం కుట్ర

కూడేరు: కేంద్రం ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి పేదల పొట్ట కొట్టేందుకు కుట్ర చేస్తోందని సీపీఎం అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్ణమూర్తి ధ్వజమెత్తారు. సోమవారం కూడేరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మర్ అలివెన్స్ తీసివేయడం, పని ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించకపోవడం దారుణమన్నారు. రెండు పూటలా పని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకునేందుకు ఈ నెల 25న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా నలమూలల నుంచి కూలీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా నాయకులు కరీం సాబ్, రాధాకృష్ణ, రైతు సంఘం నాయకుడు నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాలీవాన బీభత్సం



మల్లాపురంలో నేలకొరిగిన అరటి పంటను చూపుతున్న రైతు

రాయదుర్గం రూరల్: పట్టణంతో పాటు మండలంలో ఆదివారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. 16.4 మి.మీ. గా వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. ఈదురు గాలుల దెబ్బకు మండలంలోని మల్లాపురం , మెచ్చిరి గ్రామాల పరిధిలో ముగ్గురు రైతులకు సంబంధించిన ఎనిమిది ఎకరాల్లో అరటి పంట నేలకొరిగింది. దీంతో రైతులకు సుమారు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ఉద్యానవన శాఖ అధికారి దస్తగిరి తెలిపారు. అలాగే మల్లాపురం పరిధిలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన షెడ్డు రేకులు ఈదురు గాలులకు సుమారు 500 మీటర్ల దూరం వరకు ఎగిసి పడ్డాయి. ఆలయానికి వచ్చే దారిలో చెట్లు నేలకొరగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే పలుచోట్ల విద్యుత్ స్తంబాలు నేలకొరగడంతో ఆదివారం రాత్రి పలు గ్రామాల్లో చీకట్లు కమ్ముకున్నాయి. దీంతో మండలంలోని జుంజురాంపల్లి, రేకులకుంట, మెచ్చిరి, మల్లాపురం గ్రామాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

బెళుగుప్పలో ఓ మోస్తరు వర్షం

బెళుగుప్ప: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి కురిసిన వర్షపాతం 16 ఎం.ఎం.గా నమోదైందని ఏఓ పృథ్వీసాగర్ సోమవారం పేర్కొన్నారు. ఖరీఫ్ విత్తన సాగుకు ముందు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు ముందస్తుగా మంచి సేద్యాలు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు.

వ్యక్తి పై దాడి

కళ్యాణదుర్గం: కంబదూరు మండలం ఓబిగానిపల్లికి చెందిన మందల వెంకటేశులుపై భార్య రామలక్ష్మి కుటుంబ సభ్యులు దాడి చేశారు. ఈ సంఘటన సోమవారం ఉదయం తిమ్మాపురంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు...వెంకటేశులుకు ఆరేళ్ల క్రితం కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామానికి చెందిన రామలక్ష్మితో వివాహమైంది. వీరికి కుమార్తె సంతానం. కాగా ఏడాదిగా ఇరువురూ దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో రామలక్ష్మి విడాకులు కావాలని భర్తతో గొడవపడి పుట్టింటికి వచ్చింది. సోమవారం బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లిన వీరికి బ్యాంకు పని నిమిత్తం తిమ్మాపురానికి వచ్చిన వెంకటేశులు కనపడటంతో విడాకులు ఇంకెంత కాలం ఇలా కాలయాపన చేస్తావంటూ భార్య తరపు బంధువుల దాడికి దిగినట్లు వాపోయాడు. స్వల్పంగా గాయపడిన వెంకటేశులు కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే ఈ ఘటనపై కంబదూరు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

నేడు వాహనాల వేలం

బొమ్మనహాళ్: అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ శివ తెలిపారు. మూడు ద్విచక్ర వాహనాలు, రెండు కార్లు వేలం వేస్తామని, ఆసక్తి ఉన్న వారు రూ. 3,000 ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

రైతుకు గాయాలు

కూడేరు: పరిధిలోని పి.నాగిరెడ్డిపల్లికి చెందిన రైతు శ్రీనివాసులు రెడ్డి సోమవారం తన ఇంటి వద్ద పశువులకు పచ్చిగడ్డిని ఏర్పాటు చేసే క్రమంలో గడ్డిని యంత్రంలో పెట్టి ముక్కలుగా కట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు చేయి యంత్రంలోకి ఇరుక్కుపోయింది. దీంతో చేయి బాగా దెబ్బతింది. కుటుంబీకులు అతడిని 108 వాహనంలో అనంతపురంలోని సర్వజన ఆస్పత్రికి తరలించారు.

'పశు బీమా' సద్వినియోగం చేసుకోండి



ఉపసంచాలకుడు జి.వెంకటేశ్

ఉరవకొండ: పాడి రైతులకు ఊరట కలిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్‌పశు బీమా పథకం అమల్లోకి తెచ్చిందని ఉరవకొండ పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు జి.వెంకటేశ్ తెలిపారు. ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం, నియోజకవర్గ రైతులు పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకూ ఉన్న వైఎస్సార్ బీమా పథకంలో స్వల్పంగా మార్పులు, చేర్పులు చేస్తూ ప్రభుత్వం తాజాగా జీఓనెం–3 విడుదల చేసిందన్నారు. నేషనల్ లైవ్‌స్టాక్‌మిషన్ పథకం కింద లైవ్ స్టాక్ ఇన్సూరెన్స్ పథకం ప్రభుత్వం అమల్లోకి తేనుందన్నారు. పాడి పశువు చనిపోయిన 15 రోజుల్లోపే నష్టపోయిన రైతుకు పరిహారం వర్తించేలా నిబంధనలు రూపొందించారన్నారు. బీమా ప్రీమియం చెల్లిస్తే గేదెలు, ఎద్దులు, గొర్రెలు, మేకలకు ఈ పథకం కింద పరిహారం ప్రభుత్వం అందిస్తుందన్నారు.

సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన పలువురు గ్రామ సచివాలయ ఉద్యోగులకు అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఇన్‌చార్జి అధికారి కె.భాస్కర్ రెడ్డి బాధ్యులకు నోటీసులను అందజేశారు. ఇందులో ముఖ్యంగా గ్రామ సంక్షేమ, విద్యా సహాయకులు, వార్డు సంక్షేమ కార్యదర్శులు ఉన్నారు. కుందుర్పి మండలం నిజవళ్లి, బ్రహ్మసముద్రం మండలం వేపులపర్తి–1, కళ్యాణదుర్గం రూరల్ ముద్దినాయనపల్లి, కుందుర్పి మండలం మలయనూరు–1 సచివాలయాలకు సంబంధించిన కార్యదర్శులకు ఆయన నోటీసులిచ్చారు.

నగరవనం 'సెల్ఫీ' నవ్వులపాలు!

- పైసా నిధులివ్వకనే ఆర్భాటంగా పనులు
- ఎన్నికల ముందు హడావుడితో ప్రారంభం
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకే నిధుల మంజూరు
- అభివృద్ధి కోసం రూ. కోటితో ప్రతిపాదన



నగరవనంలో అరకొరగా ఏర్పాటు చేసిన బొమ్మలు



జనం లేక వెలవెలబోతున్న ఉద్యానవనం

రాయదుర్గం: పట్టణంలోని బళ్లారి రోడ్డు చివర్లో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'నగర వన ఉద్యాన యోజనా'న్ని చూపిస్తూ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు సోమవారం సెల్ఫీ చాలెంజ్ చేశారు. తీరా చూస్తే అతడి హయాంలో నగరవనం ఏర్పాటుకు పైసా కూడా నిధులు విడుదల కాలేదని తెలిసింది. 2018, మే 12న ఆర్భాటంగా నగరవనం ఏర్పాటుకు శంకుస్థాన చేసి సుమారు రూ.3 కోట్ల అంచనాతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. మొదటి ప్యాకేజీ ద్వారా రూ.66 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఆర్థిక శాఖ నుంచి పేపర్ మీద మాత్రమే అనుమతులు అందాయి. దీంతో అప్పట్లో కాలవ బినామీగా చెప్పుకునే ఓ కాంట్రాక్టర్ వనంలో వివిధ రకాల చెట్లు, బొమ్మలు, ఊయల వంటివి అరకొరగా ఏర్పాటు చేసి వదిలేశారు. బిల్లుల మంజూరు లోనూ ఆలస్యం కావడంతో ప్రక్రియ ముందుకు సాగలేక ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ఎన్నికలకు తేదీ దగ్గర పడటంతో ఓటర్లను ఆకర్షించేందుకు 2019, మార్చి 9న ఉన్నవాటినే సర్దుబాటుచేసి ఆర్భాటంగా నగరవనం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం కాలవ సెల్ఫీ బాగోతం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు.

రూ.32 లక్షల బిల్లులు మంజూరు..

టీడీపీ హయాంలో శిలాఫలాకాలు వేసి అరకొరగా ఏర్పాటు చేసిన నగరవనానికి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 2020–21 మధ్య సుమారు రూ.32 లక్షల నిధులను సంబంధిత కాంట్రాక్టర్ ఖాతాలకే జమచేసినట్టు అటవీశాఖ అధికారుల రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఆ మొత్తం మినహా టీడీపీ హయాంలో పైసా కూడా నిధులు విడుదల కాలేదని వారు తెలిపారు. అనుకున్న స్థాయిలో నిధులు రాబట్టి ఉంటే పంపనూరు వద్ద అభివృద్ధి చెందిన వనంలా రాయదుర్గంలో కూడా ఎందుకు తయారు కాలేదని ప్రజలు, పాలకులు ప్రశ్నిస్తున్నారు. వనం లో ఏర్పాటు చేసిన ఇద్దరు కాపలా దారులకు సైతం జీతాలు చెల్లించక పోవడంతో వారిని ఇతర పనులకు వాడుకునే దుస్థితి పట్టింది. బళ్లారి రోడ్డు చివర్లో నరసింహస్వామి ఆలయ ఆర్చ్‌కు ముందుభాగానున్న అటవీ శాఖ పరిధిలోని 12 ఎకరాల్లో నగరవనం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అయితే రైల్వే లైన్ పూర్తిగా అడ్డంకిగా మారడంతో సరైన దారి లేక వనానికి జనం రాలేకపోతున్నారు.

కాలవ దొంగ సెల్ఫీలు నమ్మేవారు లేరు: విప్



మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు విడుదల చేసే సెల్ఫీలన్నీ దొంగవేనని, ఈ విషయం ప్రజలకు బాగా తెలుసని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. పూలే గురుకుల బాలికల పాఠశాల సెల్ఫీ ఓ నాటకీయ పరిణామమని తెలియగానే ప్రజల్లో విశ్వాసం కోల్పోయాడన్నారు. పైసా నిధులు రాబట్టకనే కమీషన్ల కోసమే ఆర్భాటంగా నగరవనం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక బిల్లులు చెల్లించిన విషయంపై అధికారులు క్లారిటీ ఇచ్చారన్నారు. కాలవా..? నీ స్వార్థ రాజకీయం కోసం, నీ జిత్తుల మారి మోసాలకు ప్రజలు ఎట్టిపరిస్థితుల్లో తలొగ్గరనే విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. రాయదుర్గం పట్టణంలో ఏ వార్డుకొచ్చినా సరే నీవు మంత్రిగా ఉండే సమయాన ఏం పథకాలిచ్చావ్.. ఈ నాలుగేళ్లలో మేమెంత మంచి చేశామో లెక్కసహా చెప్తాం. వచ్చే దమ్ముందా అని సవాల్ చేశారు. పట్టణ ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారనే అక్కసుతో లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవుపలికారు. అన్ని ప్రాంతాల సమానాభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని గుర్తుచేశారు. ఇలాంటి కుట్రలకు పాల్పడితే వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లుకూడా దక్కకుండా ప్రజలే చిత్తుగా ఓడిస్తారని హెచ్చరించారు.

ప్రతిపాదనలు పంపాం

టీడీపీ హయాంలో పనులు చేసినా బిల్లులన్నీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే జమ చేశారు. అప్పట్లో అంచనా మేరకు నిధులు విడుదలై ఉంటే నగరవనం అన్నీ విధాలా అభివృద్ధి చెందేలా కృషి చేసేవాళ్లం. ఈ కారణంగా కొంత నిర్లక్ష్యం ఏర్పడింది. ప్రస్తుతం మళ్లీ పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చేలా రూ.కోటి నిధులతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరుకాగానే మరిన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతాం.

– రామ్‌సింగ్, డిప్యూటి రేంజర్ అటవీశాఖ, కళ్యాణదుర్గం

ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న పాఠశాలలను సీజ్ చేయాలి



ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం : పట్టణంలోని నారాయణ , చైతన్య కార్పొరేట్ పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని, వాటిని సీజ్ చేయాలని విద్యార్థి సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమంలో ఆర్డీఓ నిషాంత్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తూ.. అదే పాఠశాలల పేర్లతో పుస్తకాలు ముద్రించి అమ్ముతున్నారని మండిపడ్డారు. పేద విద్యార్థుల తల్లిదండ్రులకు మాయ మాటలు చెప్పి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు ఎలాంటి అనుమతులు లేకుండా కార్పొరేట్ పాఠశాలలు విచ్చల విడిగా పట్టణంలో బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ఎంఈఓను సస్పెండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, తాలుకా ఉపాధ్యక్షుడు సాయికుమార్‌నాయక్ , నాయకులు సుదీప్, ప్రణీత్ , అనిల్ ,ధనుష్, తదితరులు పాల్గొన్నారు.